# సరాగమాల

అటు వృద్ధాప్యం ఛాయ లావరించబోతుంటే ఇటు చంద్రుని కోసం చకోర పక్షుల్లా ఎదిరిచూస్తున్న పార్వతమ్మ-వెంకటేశం దంపతుల కోర్కె ఓ కొలిక్కి వచ్చింది. దశాబ్దం క్రితం సప్తసముద్రాలు దాటి అమెరికా కెగిరిపోయిన కొడుకు ఆర్నెల్ల ఫోన్ పోరాటం ఫలితంగా కోడలు-మనవరాలుతో సహా దిగి వచ్చాడు. సంబరం అంబరాన్నంటింది. ముద్దుల మనవరాలును హాయిగా ముద్దాడుతూ ముల్లాకాలను మరచిపోయారు. కోడలు శైలజను గుండెలకు హత్తుకుంది పార్వతమ్మ. కొడుకు ప్రశాంత్ కళ్లల్లోని కాంతిపుంజాలు వెంకటేశం ఎదలో గిలిగింతలు పెట్టాయి.

స్వదేశములో మెడిసిన్ పి.జీ. పూర్తవగానే అన్ని హంగులున్న అమెరికాలో ఉద్యోగం చెయ్యాలన్పించింది ప్రశాంత్‌కు. అటు అప్లికేషన్ పంపగానే రిప్లైగా ఇటు ఉద్యోగమొచ్చింది. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఉద్యోగం మానేసి తల్లిదండ్రులను మెప్పించి, ఒప్పించి, డబ్బు సంపాదించి తిరిగొస్తానని నచ్చజెప్పి రెక్కలు కట్టుకుని అమెరికాలో దిగాడు. రెండు సంవత్సరాల తర్వాత రెండు నెలల సెలవు మీదొచ్చి శైలజ మెడలో మూడుముళ్లేసి జంటగా విమానమెక్కాడు. అఖిల జనన సమయంలో వెంకటేశం దంపతులు అమెరికాలోనే ఉన్నారు. బుల్లి మనవరాలు బోసి నవ్వుల ముద్దూ ముచ్చట్లు తీర్చుకుని తిరిగొచ్చారు.

ముప్పై మూడేళ్లు ప్రభుత్వోద్యోగములో పట్టణాలకే పరిమితమై వెంకటేశం రిటైరవగానే పుట్టి పెరిగిన పల్లెటూరు కొచ్చి వ్యవసాయం పనుల్లో పులకరించి పోతున్నాడు.

ప్రశాంత్ హస్తవాసి అగ్రరాజ్యంలో తీరిక లేకుండా చేసింది. కూతురు ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదువుతున్నా ఇంటి వద్ద పట్టుబట్టి తెలుగు నేర్పిస్తున్నారు.

రాని భాషా సినిమా చూస్తున్నట్టు అయోమయంగా అటూ ఇటూ చూస్తున్న అఖిల వాలకం గమ్మత్తనిపించింది ప్రశాంత్‌కు.

"అట్లా చూస్తున్నావేంటి బేబీ!" అనునయంగా అడిగాడు.

"మీ మమ్మీ డాడీలను చూపిస్తానన్నావు. వాళ్లేరి డాడీ?" అడిగేసింది అఖిల. వెంటనే మనవరాలి నెత్తుకుని ముద్దాడాడు వెంకటేశం.

"నిన్ను ఎత్తుకున్నది మా డాడీయే. ఈమె మా మమ్మీ!" పార్వతమ్మను చూపించాడు.

"అంటే.. గ్రాండ్ మా, గ్రాండ్‌ఫాలా?"

"గ్రాండ్‌మాను తెలుగులో నానమ్మ, గ్రాండ్ ఫాను తాతయ్య అంటారమ్మా!

"వీళ్లు మీ అమ్మా నాన్నలన్నావు గదా!" పసిదాని అవగాహన వెంకటేశంను అబ్బురపరిచింది.

"తెలుగులో అమ్మ-నాన్నల్ని ఇంగ్లీషులో మమ్మీ డాడీలంటారమ్మా, మేము మీ నాన్న మమ్మీ డాడీలము. నన్ను నువ్వు తాతయ్య అని పిలవాలి. గ్రాండ్‌మామ నానమ్మా అని పిలవాలి. ఇవి అచ్చతెలుగు పదాలమ్మా" చిన్నారి బుగ్గల్ని పెదాలతో నిమిరాడు.

"సరే తాతయ్యా! తెలుగు చాలా స్వీటు. కాని మమ్మీ-డాడీలంటే తెలుగు అర్థం వేరే ఉందట గదా!" ఎప్పుడో వాళ్ల అపార్ట్‌మెంట్‌లో పక్కనున్న తెలుగు వాళ్లన్నది గుర్తుకొచ్చింది.

"మమ్మీ అంటే శవము, డాడీ అంటే శవాలను మోసే పాడెకట్టె" వెంకటేశంకు నవ్వాగలేదు.

"ఛీఛీ.. అంటే మా అమ్మ శవమా, నాన్న పాడెకట్టెనా?" ఆరిందలా లెంపలేసుకుంది.

"పాశ్చాత్యదేశాల్లో అలాగే పిలుస్తారమ్మా" భర్త ఒడిలోంచి మనవరాలును తీసుకుంది పార్వతమ్మ "ఇప్పట్నుంచి నువ్వు వీళ్లను అమ్మా, నాన్న అని పిలువమ్మా".

"షూర్.. తప్పకుండా అట్లానే పిలుస్తా నానమ్మా!" అఖిల మొహం అరవిరిసిన అరవిందమైంది.

"నా బంగారు కొండా!" మురిసిపోతూ మనవరాలితో సహా వంటింట్లో కెళ్లింది పార్వతమ్మ. వేడి చాయ్‌కప్పుల ట్రేతో తిరిగొచ్చింది.

అంతా సోఫాలో కూచుండి చాయ్ సేవిస్తుంటే ఉత్సాహం ఉరకలేసింది, మాటామంతిలో అమెరికా వింతలు, విశేషాలు, వెంకటేశం విశ్రాంత జీవనము, సొంతూరు, సొంతిల్లు, కబుర్లు చోటు చేసుకున్నాయి.

పార్వతమ్మ వెంట శైలజ వంటింట్లో కెళ్లింది. అఖిల తాతయ్య పక్కన కూచుండి ఏవేవో సందేహాలడుగుతోంది. ఈ తాత మనవరాళ్ల మధ్య నేనెందుకని బయటికెళ్ళాడు ప్రశాంత్. చిన్న నాటి స్నేహితులను కలుసుకుంటున్నాడు.

× × × × ×

తెలుగు లోగిళ్ళలో వెలుగులు విరజిమ్ముతూ నూతన సంవత్సరాది ఉగాది పండుగ వచ్చింది. ప్రకృతి లాగా మనుషులు నూతన వస్త్రాలు ధరించారు. షడ్రుచుల పచ్చడి సేవించారు. అంతా టీ.వి. ముందు కూచున్నారు. అఖిల తాతయ్య ఒడిలో కూచుంది. టీ.వి.లో బియ్యంతో కొత్త వంటకం చూపిస్తున్నారు.

"తాతయ్యా! నాకు బియ్యం చెట్లు, మామిడి తీగలు చూపించవా" ఠపీన అడిగేసింది అఖిల. గొల్లున నవ్వారంతా. అఖిల ముఖం కందగడ్డలాగైంది. రిమోట్‌తో టీ.వి. ఆపేసి "ఎందుకు నవ్వారు తాతయ్యా" రోషంగా అడిగింది.

"బియ్యం చెట్లు ఉండవమ్మా.." తో ప్రారంభించి, కర్రలు, బియ్యం తయారయ్యే విధానం, మామిడి చెట్లు - పూత, కాయల గురించి వివరంగా చెప్పాడు.

గుడిలో పంచాంగం శ్రవణమప్పుడు నూతన సంవత్సర రాశిఫలాలు, ఆదాయవ్యయాలు తెలుసుకున్నారు. మధ్యాహ్నం భక్ష్యాలు, సర్వపిండి వంటకాలతో తృప్తిగా భోంచేశారు.

సాయంత్రం అంతా కలిసి తమ పొలం వైపుబయలుదేరారు. అఖిలకు వరిపొలం చూపిస్తూ మామిడి తోట చేరుకున్నారు. మామిడి రెమ్మలు తలలూపుతుంటే, తుమ్మెద ఝుంకారాలు నాదస్వరాల్లా స్వాగతం పలికాయి. మనసులు ఆనంద డోలికలూగుతున్నాయి. అఖిల లేడిపిల్లలా గంతులేసింది. కాసేపు తోటలో తిరిగారు. ఓ చోట నేలమీద కూచున్నారు. రెమ్మల సందుల్లోంచి చొచ్చుకొచ్చిన సూర్యకిరణాలు పక్కన తచ్చాడుతున్నాయి. తోటమాలి మామిడికాయలు కోస్తుంటే అఖిల లేడిపిల్లలా గంతులేసింది. వెంట తెచ్చిన ఉప్పు, కారం పొడిలో మామిడి ముక్కలు అద్దుకు తింటూంటే కమ్మని రుచుల సంగమం మరో లోకములో విహరింపజేసింది.

శైలజ కేదో గుర్తుకొచ్చింది. నుదుటి మీద గాలి తరంగాలతో ఆడుకుంటున్న ముంగురుల్ని పైకి ఎగదోసుకుంటూ ఫక్కున నవ్వింది. కారణమేమిటని కళ్లతో అడిగింది పార్వతమ్మ."ఏంలేదత్తయ్యా !

ఈ ప్రకృతి పరవశింపుల్ని చూస్తుంటే నాకో అమెరికా అనుభవం గుర్తుకొచ్చింది. చూపులు భర్తవైపు మళ్లాయి.

"అదేదో చేస్తే అంతా సంతోషిస్తారుగదా!" చేతిలోని కట్టెపుల్లను విరిచి పారేశాడు ప్రశాంత్.

శైలజ సర్దుక్కూచుంది. "అఖిల కడుపులో ఉన్నప్పుడు మేమోసారి పార్కుకెళ్లాము." పట్టుపైటను నడుముకు బిగించింది. "నన్నోచోట కూచోబెట్టి ఆయన ఐస్‌క్రీమ్ తెస్తానని వెళ్లాడు. ఒంటరిగా వెళ్లి, మరో అమ్మాయితో జంటగా వచ్చాడు..." నవ్వాపుకోలేక గలగలా నవ్వేసింది.

"ఆ వన్నెల విసనకర్రను నేను రమ్మనలేదు. ఆవిడే నా వెంటబడింది" అమాయకత్వాన్ని వలకబోశాడు ప్రశాంత్.

"ఏదో ఒకటి.. ఆ తర్వాత ఏం జరిగిందో తమరే చెప్పండి."

"ఏమైందిరా!" పార్వతమ్మలో ఆసక్తి అర్రులు చాచింది.

"ఆ అమ్మాయి మా ఆఫీసులో కొత్తగా చేరింది. తనతో డేటింగ్ అంటే షికారుకు రమ్మని రెండుసార్లు అడిగింది. నేను కుదరదన్నాను. ఆరోజు ఐస్‌క్రీమ్‌లు కొంటూ ఆమె కంటబడ్డాను. అంతే... కోతికి కొబ్బరిచిప్ప కనబడ్డట్టు వెంటబడింది. అంతేనమ్మా."

"మరి నువ్వేమన్నావమ్మా?" వెంకటేశం అడిగాడు శైలజను.

"ఈయనే నాకావిడను పరిచయం చేశాడు. నేను తన భార్యనని గూడా చెప్పాడు. అయినా ఆ ఫారిన్ గర్ల్ ఊరుకోలేదు."

"ఏం చేసిందమ్మా!" పార్వతమ్మ బుగ్గలు నొక్కుకుంది.

"నాకు విడాకులిచ్చి తనను పెళ్లి చేసుకోమంది."

"అమ్మో గుండెలు తీసిన బంటు అన్నమాట!"

"అవును మామయ్యా! నేనూరుకుంటానా? మా భారతీయ సంస్కృతిలో భార్యా భర్తల బంధం జన్మాంతము. కాంట్రాక్టు పెళ్లిళ్లుండవని వివరంగా చెప్పను. పాపం! పెదాలు చప్పరిస్తూ తోకముడిచింది." మరోసారి గలగలా నవ్వింది. ఆ నవ్వులో గంగాయమునల సంగమధ్వని వినిపించింది.

పెద్దవాళ్లకు నవ్వాగలేదు. అర్థంగాక అఖిల మూతి తిప్పింది.

× × × × ×

రెండు నెలలు రెండు రోజుల్లా కరిగిపోయాయి. ప్రశాంత్ దంపతులు అమెరికా తిరిగి వెళ్లేందుకు తయారయ్యారు. పల్లె ప్రశాంత వాతావరణం అఖిలను ఆనందడోలికలూగించింది. నానమ్మ ఒడి ప్రాణప్రదమైంది.

"నాన్నా! నేను అమెరికారాను. నానమ్మ దగ్గరే ఉంటా" అని పట్టుబట్టింది. అదేం కుదరదన్నారు తల్లిదండ్రులు.

మనవరాలి నవ్వులూ, అలకలు, ముద్దు ముచ్చట్లు వెంకటేశం దంపతుల గుండెల్లో గుసగుసలు రేపాయి. అఖిలను పంపించాలంటే బాధగా ఉంది. కాని కొడుకు-కోడలు ఐదేళ్ల తర్వాత స్వదేశానికి తిరిగొచ్చి శాశ్వతంగా ఉండిపోతామని గట్టి హామీయిచ్చారు.

వెంకటేశం బాధనంతా నుదుటి రేఖల్లో దాచిపెట్టుకుని మనవరాలిని ముద్దాడాడు. కొడుకుతో "మీరు ప్రతి సంవత్సరం వచ్చి ఓ నెలరోజులుండి పోవాలిరా?" అంటూంటే గొంతు వణికింది. చిప్పిల్లిన

కళ్లను చేతిగుడ్డతో అద్దుకున్నాడు. పార్వతమ్మ కోడలిని అక్కున చేర్చుకుని సంవత్సరాని కొక్కసారన్నా మిమ్మల్ని చూడకుంటే మా ప్రాణాలు విలవిల్లాడి పోతాయమ్మా!" అంటూ గుండెలకు హత్తుకుంది.

ప్రశాంత్-శైలజలు కళ్లతో సంప్రదించుకున్నారు.

"తప్పకుండా వస్తామత్తయ్యా!" కొనకొంగుతో తన కళ్లు అద్దుకుని అత్తగారి కళ్లు అద్దింది శైలజ.

అత్తయ్యలో అమ్మ కనబడిందామెకు.

--- ÷ ---

(సాహితీ కిరణం
అక్టోబర్ 2010)

